చెరువుకట్టపై నీటి మడుగులు

- వర్షమొస్తే ప్రయాణానికి ఆటంకం
- ఏళ్లు గడుస్తున్నా బీటీరోడ్డుకు మోక్షం లేదు
- మడుగుల్లో వరినాట్లు వేసి ప్రజల నిరసన



వర్షపునీటితో మడుగును తలపిస్తున్న హన్వాడ పెద్దచెరువుకట్ట



టంకర-గుడ్డిమల్కాపూర్ మధ్యలో టంకర పెద్ద చెరువుకట్టపై వరినాట్లు వేసి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

హన్వాడ: ఆ గ్రామాలు అటు జిల్లా కేంద్రానికి, ఇటు మండల కేంద్రానికి రావాలంటే చెరువుకట్టల మీద ఏర్పాటు చేసిన దారిలో రావాలి. వర్షం కురిసిందంటే చాలు దారికాస్త మడుగును తలపించేలా తయారవుతుంది. దీంతో కాలినడకకు కూడా అవకాశం లేకపోవడంతో చేసేది లేక మండల పరిధిలోని టంకర గ్రామస్తులు సోమవారం ఉదయం దారిపొడువునా మడుగుల్లో వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రం నుంచి టంకర మీదుగా గుడ్డిమల్కాపూర్ వరకు బీటీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నాలుగేళ్ల క్రితం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించిన అధికారులు ఇప్పటికీ పనులు పూర్తి చే యించలేదు. పనులు దక్కించుకున్న గుత్తేదారు తనకు రావాల్సిన పెండింగ్ బిల్లులు రాలేదని హన్వాడ, టంకర గ్రామాల పెద్దచెరువుల కట్టలపై మట్టిని తోడించి అలాగే వదిలేశాడు. దీంతో 'చినుకుపడితే చిత్తడే' అనే రీతితో రెండుగ్రామాల చెరువు కట్టలపై ఈ దుస్థితి నెలకొంది. తాజాగా ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి టంకర, హన్వాడ పెద్ద చెరువుకట్టలపై ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గుడ్డిమల్కాపూర్ ప్రజలు టంకర చెరువుకట్ట, హన్వాడ చెరువు కట్టలను దాటుకుని హన్వాడకు రావాల్సి ఉండగా, టంకర ప్రజలు హన్వాడ పెద్ద చెరువుకట్టను దాటుకుని రావాల్సి ఉంటుంది. నాలుగేళ్ల క్రితం రూ.2కోట్లతో పనులు చేపట్టినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన వాటా రాకపోవడంతో పనులు నిలిచినట్లు తెలిసింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి నిలిచిన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



నవాబుపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నవాబుపేట: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి సొంతింటి కల నెరవేస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కాకర్లపహాడ్, యన్మన్‌గండ్ల, నవాబుపేట, ఇప్పటూర్, కొండాపూర్ గ్రామాల్లో లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల పనులను ఆయన మండల అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా ఏళ్లుగా సొంత ఇల్లు లేక ఇబ్బంది పడ్డ ప్రజలకు తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 లక్షలతో నిర్మాణం చేపట్టిందన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటి కలనెరవేరుతుందని ఆయన వివరించారు. మొదటి విడతలో త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తే, రెండో విడత సైతం ఇళ్లు మంజూరు చేసేందుకు ఎమ్మెల్యే సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మైసమ్మ ఆలయ చైర్మన్ జనగ్‌మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ జయరాంనాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, నరేష్, ఆంజనేయులు, కుమార్, వెంకటయ్య, రాజేష్, సురేష్, హమీద్, రవి, శ్రీనువాస్, అంభదాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

సుందరయ్య వారసత్వాన్ని కొనసాగిద్దాం



దివిటిపల్లిలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, చిన్నారులు



జడ్చర్లలో సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్/జడ్చర్ల టౌన్: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వారసత్వాన్ని కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రాములు అన్నారు. సోమవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పుచ్చలపల్లి సుందరయ్య, ఆదివారం మరణించిన సిపిఎం రాష్ట్ర నాయకులు రఘుపాల్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమసమాజ స్థాపన కోసం సుందరయ్య చేసిన కృషి మరువలేనిదన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ముందుండి నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా ఉద్యమం చేశారన్నారు. సుందరయ్య బావితరాలకు ఆదర్శప్రాయుడని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కిల్లె గోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, రామ్‌రెడ్డి, రామదాసు, కృష్ణయ్య, ఖమర్ అలీ, చంద్రకాంత్, ప్రశాంత్, పాల్గొన్నారు.

- మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని దివిటిపల్లి డబుల్ బెడ్రూం కాలనీలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. పుచ్చలపల్లి సుందరయ్య జీవితం అందరికీ ఆదర్శనీయమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడియాల మోహన్ అన్నారు. కార్యక్రమంలో మల్లెల మాణిక్యం రాజు, గణేష్, కార్తీక్, సుప్రజ, శివ, వంశీ తదితరులు పాల్గొన్నారు.
- జడ్చర్ల పట్టణంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా నాయకులు జగన్ సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఈర్లపల్లి యాదయ్య, సాయిలు, కర్ణ, బాలస్వామి, భీంరాజ్, నర్సింహ పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచాలి



నవాబుపేటలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జయరాంనాయక్

నవాబుపేట: గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు సంబంధించి కూలీల సంఖ్యను మరింత పెంచాలని అధికారులు సిబ్బందికి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో మండలంలోని వివిధ శాఖల అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టి వాటికి అనుగుణంగా కూలీల సంఖ్య పెంచాలని ఆయన సూచించారు. ఉపాధి పనుల్లో గ్రామాల్లోని తాగునీటి ఎద్దడి నివారణకు బోర్ల మరమ్మతు లాంటి పనులు సైతం ఉపాధి పనిలో చేపట్టి గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలాన్నారు. నర్సరీలలో వంద శాతం మొక్కల పెంపకం జరగాలని వివరించారు. సమావేశంలో ఈపీఆర్‌డీ భద్రునాయక్, ఏపీఓ జ్యోతి, తదితరులు ఉన్నారు.

పచ్చదనం ఏ'మాయె!'



అబ్దుల్ ఖాదర్ దర్గా సమీపంలోని రహమానియా బ్రిడ్జి వద్ద ఎండిపోయిన మొక్కలు



మెయిన్ రోడ్డుపై శ్రీనివాసకాలనీ వంతెన వద్ద ఇలా..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగర సుందరీకరణలో భాగంగా సుమారు రెండేళ్ల క్రితం మెయిన్ రోడ్డు (ఎన్‌హెచ్–167)పై స్థానిక అబ్దుల్‌ఖాదర్ దర్గా సమీపంలోని రహమానియా బ్రిడ్జితో పాటు శ్రీనివాసకాలనీ వద్ద చిక్కుడువాగుపై ఉన్న పెద్ద వంతెన కు ఇరువైపులా ఏటవాలుగా మొక్కలు ఏర్పాటు చేశారు. అప్పట్లో వీటి నిర్వహణ బాధ్యతలు ఓ కాంట్రాక్టర్‌కు ముడా అధికారులు అప్పగించారు. వాటి సంరక్షణ పట్టించుకోక పోవడంతో తరచు ఎండిపోతున్నాయి. ప్రస్తుతం ఎండాకాలం ఆపై పచ్చదనం కనుమరుగుకావడంతో పాదచారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు నీరు పట్టేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ముగిసిన వేసవి శిబిరం



అడ్డాకుల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వేసవి శిబిరం సోమవారం ముగిసింది. 6,7,8,9వ తరగతులకు చెందిన విద్యార్థులకు ఈనెల 7న స్థానిక పాఠశాలలో ఉచిత వేసవి శిబిరం ప్రారంభమైంది. 13 రోజుల పాటు జరిగిన శిబిరంలో ఆర్ట్, డ్రాయింగ్, క్రాఫ్ట్, చెస్, క్యారమ్స్, క్రికెట్ నేర్పించడానికి నలుగురు వలంటీర్లను ఏర్పాటు చేశారు. వాటిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కురుమూర్తి, హెచ్‌ఎం జ్యోతి, పీడీ మంజుల, భాస్కర్, స్వప్న, హారతి, సీఆర్‌పీ చెన్నయ్య, శివ, తదితరులు పాల్గొన్నారు.

చిరుతను త్వరలో పట్టుకుంటాం



కోయిల్‌కొండ: చిరుతను త్వరలోనే పట్టుకుంటామని అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో గత కొద్దిరోజులు చిరుత సంచరించడంతో సోమవారం బీట్ అధికారులతో కలిసి ఫింజర్‌గుట్ట పరిసర ప్రాంతాలను పరిశీలించారు. చిరుత పట్ల ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావొద్దని తెలిపారు. త్వరలోనే చిరుతను పట్టుకొని బందిస్తామన్నారు. ఆయన వెంట బీట్‌అధికారులు రాఘవేందర్, చంద్రశేఖర్ ఉన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

జడ్చర్ల టౌన్: మండలంలోని ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు, ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు శిక్షణ ఉంటుందని ఎంఈఓ మంజులాదేవి సోమవారం తెలిపారు. జడ్చర్ల జెడ్పీహైస్కూల్‌లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కొనసాగే శిక్షణకు తప్పని సరిగా హాజరు కావాలని ఆమె సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దేవరకద్ర: మండలంలోని గద్దెగూడెం గ్రామంలో ఆదివారం రాత్రి పిడుగుపాటుకు గురై ఇంటర్ విద్యార్థి ఉదయ్‌కుమార్ మృతి చెందిన సంఘటన విదితమే. సోమవారం బాధిత కుటుంబ సభ్యులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజిల్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆర్థిక సహాయం అందజేశారు. అదే విధంగా తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వ్యక్తి మృతి: కేసు నమోదు

నవాబుపేట: వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సిద్దోటం గ్రామంలో చోటుచేసుకుంది. అతని కుమారుడు మహేష్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. సిద్దోటం గ్రామానికి చెందిన కోడిగంటి దశరథం (58) ఆదివారం ఇంట్లో పడుకున్న చోటనే మృతి చెందాడు. దశరథం భార్య కొన్ని సంవత్సరాల క్రితం మరణించగా, అ ప్పటి నుంచి అతను తీవ్ర అనారోగ్యంతో ఇబ్బందులు పడుతుండేవాడు. పరిస్థితి విషమించి ఆది వారం పడుకున్న చోటనే మృతి చెందాడు. తండ్రి మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని కుమారుడు పోలీసులకు వివరించాడు.

అనుమతి లేదని షట్టర్లకు తాళం

- కమిషనర్ చాంబర్‌లో భైఠాయించిన బాధితులు



మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో కుటుంబసభ్యులతో బైఠాయించిన బాధితులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్ ఎదురుగా నిర్మించిన షట్టర్లకు అనుమతి లేదంటూ అధికారులు తాళం వేయటంతో బాధితులు మోజెస్, టైటాస్‌లు కుటుంబ సభ్యులతో కలిసి కమిషనర్ చాంబర్‌లో బైఠాయించి గంటల పాటు ఆందోళన వ్యక్తం చేశారు. వివరాలిలా ఉన్నాయి. అర్బన్‌హెల్త్ సెంటర్ ఎదురుగా 167వ నంబరు జాతీయ రహదారిపై రోడ్డు విస్తరణ అనంతరం ఉన్న కొద్దిపాటి జాగాలో షట్టర్లు నిర్మించారు. అయితే వాటికి అనుమతి లేదంటూ వాహబ్ అనే వ్యక్తి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డికి మౌఖిక ఆదేశాలిచ్చారు. దీంతో ఆయన సిబ్బందిని పంపించి వాటికి తాళం వేయించారు. దీంతో బాధితులు తమకు రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోగా ఎలాంటి పరిహారం ఇవ్వలేదని, మిగిలిన జాగాలో నిర్మాణం చేసుకుంటే తాళం ఎందుకు వేస్తారంటూ కుటుంబ సభ్యు లు కమిషనర్ చాంబర్‌లో బైఠాయించారు. కమిషనర్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తూ 3గంటల పాటు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ క్రమంలోనే స్థానిక కౌన్సిలర్లు కుమ్మరి రాజు, చైతన్య చౌహాన్‌లు, మాజీ ఎంపీపీ నిత్యానందంలు జోక్యం చేసుకుని కమిషనర్‌తో నేరుగా, అదనపు కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి తాళాలు ఇప్పించటంతో ఆందోళన విరమించారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు షట్టర్లకు తాళం వేయించినట్లు తెలిపారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు



వెన్నాచేడ్‌లో వరి కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ మాధవి

గండేడ్: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దని ఇన్‌చార్జి తహసీల్దార్ మాధవి పేర్కొన్నారు. సోమవారం ఆమె రంగారెడ్డిపల్లి, వెన్నాచేడ్ వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడారు. కొనుగోలులో ఇబ్బందులున్నాయా, గన్నీ బ్యాగులు వస్తున్నాయా లేదా? అని తెలుసుకున్నారు. కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం వసతులు కల్పించాలని ఆమె నిర్వాహకులకు సూచించారు. వర్షం పడితే తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఆమె వెంట ఆర్ఐ యాసిన్, జూనియర్ అసిస్టెంటు రాంచంద్రయ్య, వీఆర్ఏ నరేష్‌లు ఉన్నారు.

కొన్న ధాన్యం వెంటనే తరలించాలి

దేవరకద్ర: రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని తహసీల్దార్ కృష్ణయ్య సూచించారు. సోమవారం దేవరకద్ర మండలం డోకూర్ గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా వచ్చిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. రాత్రి వేళ ధాన్యం వద్ద కాపాలాకాసే విధంగా రైతులను ఇబ్బందికి గురి చేయొద్దని సూచించారు. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రం ద్వారా కొన్న ధాన్యం వివరాలను పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ శరత్‌చంద్ర, సీఈఓ శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

నేటినుంచి గాధిర్యాల్ హనుమాన్ జయంతి



గాధిర్యాల్‌లో హనుమాన్ ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

మహమ్మదాబాద్: మండలంలోని గాధిర్యాల్ వీరాంజనేయ స్వామి ఉత్సవాలు పరిశుద్ధానందస్వామి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఉదయం సుప్రభాతం, మహాగణపతి గౌరిపూజ, స్వస్తి పుణ్యావాచనం, ధ్వజారోహణం, సకలదేవతల మండపారాధన, అఖండ దీపారాధన, రుద్రాభిషేకం, పార్వతీపరమేశ్వర కల్యాణోత్సవం, తీర్థప్రసాద వితరణ, భజనలు చేస్తారు. 21న యాగశాల ప్రవేశం, అభిషేకం, హనుమాన్, శ్రీరామ హోమం నిర్వహిస్తారు. 22న గురువారం సుప్రభాతం, తెల్లవారు జామున రథోత్సవం, స్వామివారి అభిషేకం, సాయంత్రం పల్లకీసేవ, బొడ్రాయి బోనాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టీ రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి హాజరుకానున్నట్లు వారు తెలిపారు. ఆయా గ్రామాల భక్తులు తప్పకుండా హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

అవకతవకలపై విచారణ చేయాలి



ఫిర్యాదు చేసిన మహిళాసంఘం సభ్యులు

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని రాంపూర్‌లో ఆరు మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాల చెల్లింపులో అవకతవకలు జరిగాయని, వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని రాంపూర్ గ్రామ మహిళా సంఘాల సభ్యులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గ్రామంలో స్వయం సేవక సంఘంగా ఆరు గ్రూపులుగా ఏర్పడి గోల్డెన్ మహిళా సంఘం రూ.7లక్షలు, శ్రీవిష్ణు మహిళా సంఘం రూ.6లక్షలు, వెన్నెల మహిళా సంఘం రూ.10లక్షలు, తాజ్‌మహల్ సంఘం రూ.10లక్షలు, సూర్యలక్ష్మీ మహిళా సంఘం రూ.10లక్షలు, ఆదర్శ మహిళా సంఘం రూ.10లక్షలు మహబూబ్‌నగర్ బ్రాంచ్ ఎస్‌బీఐ బ్యాంకులో ఫీల్డ్‌ఆఫీసర్ సహాయంతో రుణాలు తీసుకున్నట్లు తెలిపారు. దీంతో ప్రతి నెల వాయిదాల పద్ధతిలో గార్లపహాడ్ మినీ బ్యాంకులో బ్యాగలక్ష్మికి చెల్లించారు. ఆ డబ్బులను భాగ్యలక్ష్మి తమ బ్యాంకు ఖాతాలలో జమచేయలేదని, బ్యాంకు వారిని అడిగితే వారు సమాధానం దాటవేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబంధిత అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని ప్రజావాణిలో పేర్కొన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ



మిడ్జిల్‌లో జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

మిడ్జిల్: ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై సరఫరా చేసిన జీలుగ విత్తనాలను సోమవారం సింగిల్ విండో కార్యాలయం దగ్గర చైర్మన్ శ్రీనువాస్‌రెడ్డి పంపిణీ చేశారు. రైతులు పొలంలో సారవంతం పెంచి అధిక దిగుబడి సాధించేందుకు జీలుగ విత్తనాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. సబ్సిడీపై బస్తా రూ.2137.50లకు లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ అల్వాల్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సిద్దార్థ, నాయకులు భాస్కర్‌రెడ్డి, అనిల్, వెంకటయ్య, గౌస్, సాయిలు, మల్లికార్జున్, వంశీ, ధృవ, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు

దేవరకద్ర: రైతులకు 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తామని మండల వ్యవసాయ అధికారి రాజేందర్ అగర్వాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 30 కేజీల జీలుగ విత్తనాల బస్తా ధర రూ.4375 కాగా, 50 శాతం సబ్సిడీపై రూ. 2137.50 లకు లభిస్తుందని తెలిపారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, బ్యాంకు పాస్ బుక్‌తో పాటు ఫోన్ నెంబర్‌తో గ్రామ విస్తీర్ణ అధికారిని సంప్రదించాలని కోరారు.

క్షయవ్యాధి గ్రస్తులకు న్యూట్రీషన్ కిట్లు



నవాబుపేటలో క్షయవ్యాధిగ్రస్తులకు న్యూట్రీషన్ కిట్లు అందిస్తున్న వైద్యాధికారి

నవాబుపేట: క్షయ వ్యాధిగ్రస్తులకు వివిధ రకాల న్యూట్రీన్ కిట్లను అందించినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో క్షయవ్యాధిగ్రస్తులకు 40 మందికి కిట్లను అందించారు. ప్రభుత్వం అందించే మందులతో పాటు ఈ పౌష్టికాహారం తీసుకుంటే వారికి వ్యాధి తీవ్రత చాలా తగ్గుతుందన్నారు. కాబట్టి గ్రామాల్లో ఉన్న వ్యాధిగ్రస్తులకు వైద్య సిబ్బంది మందులతో పాటు వీటిని అందించి వారికి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. వారిని నిరంతరం పర్యవేక్షణ చేస్తూ వారికి సలహాలు, సూచనలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాస్, రాఘవేందర్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కల్యాణలక్ష్మి పథకం పేదలకు వరం

గండేడ్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరం అని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం గండేడ్ మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఆసరాగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగలక్ష్మి, డీటీ మాధవి, గండేడ్, మహమ్మదాబాద్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు జితేందర్‌రెడ్డి,కేఎం నారాయణ,పుల్లారెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుడిలా పార్టీ కోసం పని చేయాలి

హన్వాడ: కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని, స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని టీపీసీసీ పరిశీలకుడు భాస్కర్, పీసీసీ కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. మండల నూతన కార్యవర్గం, గ్రామాల్లో నూ నూతన కమిటీల ఏర్పాటుకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తుల స్వీకరణ, పార్టీ విస్తరణపై చర్చలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎన్పీ వెంకటేష్, సురేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, డీసీసీ జనరల్ సెక్రటరీలు సిరాజ్‌ఖాద్రి,టంకర కృష్ణయ్యయాదవ్,కృష్ణయ్య,మండల అధ్యక్షుడు మహేందర్, సీనియర్ నాయకులు యాదవరెడ్డి, లక్ష్మణ్,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి సుందరకాండ పారాయణం

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట శివాలయం వద్ద బుధవారం నుంచి వారం రోజుల పాటు సుందరకాండ పారాయణం నిర్వహిస్తున్నట్లు పారాయణకర్త డా.దీక్షితుల సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ నెల 21నుంచి 27 వరకు జరిగే పారాయణం కార్యక్రమానికి పట్టణవాసులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. సుందరకాండ పారాయణం ఆయురారోగ్య వంశాభివృద్ధి జరుగుతుందని ఆయన వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహప్రతిష్ఠ



రాజాపూర్: మండలంలోని తిర్మలాపూర్ గ్రామ శివారులో ఆంజనేయస్వామి దేవాలయ పునఃనిర్మాణం, ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాలు సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభించారు. మొదటి రోజు విగ్రహజీర్ణోద్ధరణ, హోమం నిర్వహించారు. ఎంతో పురాతన ఆలయం కావడంతో ఆలయాన్ని పునఃనిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠకు ప్రజలు ఉత్సాహంగా హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రామస్తులు సంతోష్‌కుమార్‌గుప్తా, మహిపాల్‌రెడ్డి, పుల్లారెడ్డి, భీమయ్య, మాదవాచారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రోడ్డుపైనే పార్కింగ్?



అడ్డాకుల: మూసాపేట మండలం వేముల స్టేజీ వద్ద కొనసాగుతున్న అండర్ బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో హైవేపై భారీ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. సాయంత్రం వేళ ఈ స్టేజీ వద్ద బస్సులు, ఆటోలు నిలిపే చోట లారీలను ఆపుతున్నారు. దీనివల్ల బస్సులు స్టేజీ వద్ద ఆపకుండా ముందుకెళ్తున్నాయి. దీంతో ప్రయాణికులు బస్సుల వద్దకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. రహదారి నిర్వాహకులు స్టేజీల వద్ద లారీలను పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దేశ రక్షణకు రూ.లక్ష విరాళం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): దేశ రక్షణ కోసం ప్రాణాలను అర్పిస్తున్న సైనికుల సహాయార్థం తమ వంతుగా జిల్లా కేంద్రానికి చెందిన లిటిల్ స్కాలర్ స్కూల్ యాజమాన్యం లక్ష రూపాయలు విరాళం అంజేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్లో స్కూల్ కరస్పాండెంట్ జలజం అరుంధతి రాయ్ రూ.లక్ష చెక్కును కలెక్టర్ విజయేందిరకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. దేశ రక్షణకోసం తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా పోరాటం చేస్తున్న వారి సంక్షేమానికి విరాళం ఇవ్వడం సంతోష కరమని అన్నారు. ఈ నిధులను సైనిక సంక్షేమానికి పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లిటిల్ స్కాలర్ పాఠశాల సిబ్బంది వినోద్, మునీర్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.